క్లుప్తంగా

'కొత్తూరు' హుండీ ఆదాయం రూ. 25 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 25 లక్షలు వచ్చింది. సోమవారం భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా..రూ. 25,03,320 నగదు, 8.600 గ్రాముల బంగారం, 830 గ్రాముల వెండి వచ్చింది. మార్చి 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన బియ్యానికి వేలం పాట నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గడివేముల: మండలంలోని ఎల్‌కె తండా గ్రామానికి చెందిన లక్ష్మనాయక్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో అతని ఇంట్లో 9 క్వాటర్లు మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మందులన్నీ అందుబాటులో ఉంచాలి

గడివేముల: ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని నంద్యాల జిల్లా ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన హెల్త్‌బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఈహెచ్‌ఆర్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది ప్రతి రోజు సయమానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రంజిత కుమారి, ఎంపీహెచ్‌ఈఓలు శివరామయ్య, వెంకటసుబ్రమణ్యం, పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సత్కారం



పదవీ విరమణ పొందిన ఎంఈఓ తైమూర్ బాషాను సత్కరిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎంఈఓ తైమూర్‌బాషా సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కోడుమూరు బాలుర హైస్కూల్లో ఎంఈఓ తైమూర్‌బాషాను డిప్యూటీ డీఈఓ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాముడు, కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు భాగ్యరత్న, ఎంఈఓ వసంతలక్ష్మి తదితరులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్ సేవలు అభినందనీయం



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కల్లూరు : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు సెంటర్ అభివృద్ధికి ఇన్‌చార్జిగా చంద్రశేఖర్ చేసిన సేవలు అభినందనీయమని కర్నూలు, నంద్యాల జిల్లాల డీఎస్‌డీఓలు భూపతిరావు, ఎంఎస్‌వీ రాజు అన్నారు. సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆవరణలో సాయ్ కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్‌గా పదవీ విరమణ చేసిన చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. దేవేందర్, క్రీడాకారులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

కల్లూరు: మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తన సొంత నిధులతో సోమవారం నగరంలోని దామోదర సంజీవయ్య స్మారక మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు 400 స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆట మైదానాన్ని చదును చేసి ఆటలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఆయన మాట్లాడుతూ.. దాతలు, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుడిపల్లి సురేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డున్నా బస్సుల్లేవ్!

- కోడుమూరు-గూడూరు మధ్య తిరగని ఆర్టీసీ బస్సులు
- బస్సుల్లేక నరకయాతన అనుభవిస్తున్న ప్రజలు
- ప్రయాణానికి ఆటోలే దిక్కు



నూతనంగా వేసిన కోడుమూరు- గూడూరు రహదారి



కోడుమూరు నుంచి గూడూరు కిక్కిరిసిన ప్రయాణికులతో వెళుతున్న ఆటో

కోడుమూరు రూరల్: నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు నుంచి గూడూరుకు వెళ్లేందుకు చక్కటి రోడ్డున్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల కిందట రోడ్డు బాగోలేదన్న కారణంతో ఆర్టీసీ అధికారులు కోడుమూరు-గూడూరు మధ్య బస్సులను నడపడం మానేశారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోడుమూరు-గూడూరు మధ్య నూతనంగా రోడ్డు వేశారు. రోడ్డు వేసి ఏడాదిన్నరవుతున్నా అధికారులు మాత్రం ఆర్టీసీ బస్సులను నడపడం లేదు. మండల కేంద్రమైన గూడూరులో సివిల్ సప్లై గోదాముతో పాటు, ట్రెజరీ కార్యాలయం కూడా ఉంది. ప్రతి రోజు కోడుమూరు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన అనేక మంది ఉద్యోగులు, డీలర్లు నిత్యం గూడూరుకు వెళ్లి వస్తుంటారు. అలాగే గూడూరు నుంచి కూడా వివిధ అవసరాల కోసం ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు కోడుమూరుకు వచ్చి వెళుతుంటారు. దీంతో గూడూరు, చనుగొండ్ల, కోడుమూరు మీదుగా నిత్యం వందలాది మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. బస్సుల్లేక వారంతా సొంత వాహనాలుగానీ, ఆటోలను గానీ ఆశ్రయించాల్సి వస్తోంది. సొంత వాహనాలు లేని వారు కిక్కిరిసిన ఆటోల్లో ప్రయాణాలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా తక్కువలో తక్కువ పది మంది ఎక్కితేగానీ ఆటోలు ముందుకు కదలని పరిస్థితి. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కోడుమూరు-గూడూరు మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం



ఆర్టీసీ బస్సుల్లేకపోవడంతో ప్రతిరోజూ కోడుమూరు, గూడూరుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏ పనిమీద వెళ్లాలన్నా బైక్‌గానీ, ఆటోలుగానీ ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో రోడ్డు బాగోలేదని బస్సు సర్వీసులను నడపడం మానేశారు. ప్రస్తుతం రోడ్డు బాగున్నా బస్సులు నడపడం లేదు. ఇకనైనా మా గ్రామం మీదుగా కోడుమూరు-గూడూరు మధ్య ఆర్టీసీ బస్సు నడిపితే బాగుంటుంది.

– మహేశ్వరరెడ్డి, చనుగొండ్ల, గూడూరు మండలం

పట్టించుకోవడం లేదు



కోడుమూరు నుంచి చనుగొండ్ల గ్రామం మీదుగా గూడూరుకు బస్సు సర్వీసు నడిపితే బాగుంటుంది. కోడుమూరు నియోజకవర్గంలో ఎంతో ప్రధానమైన కోడుమూరు – గూడూరు మధ్య బస్సును తిప్పకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సర్వీసులను నడపాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ మార్గంలో బస్సులను నడిపితే బాగుంటుంది.

– మోహన్, సీపీఎం మండల కార్యదర్శి, గూడూరు

సర్వీసు రోడ్డు నిర్మించాలి



టోల్‌ప్లాజా మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు: మండలం కేంద్రం గుండా వెళ్తున్న జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, మండల సహాయ అధికారి సుధాకర్ అధికారులను కోరారు. సోమవారం టోల్‌ప్లాజ మేనేజర్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ, స్థానిక కుందూవాగు వంతెన నుంచి రాక్‌గార్డెన్ వరకు సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నన్నూరు, హుసేనాపురం గ్రామాల వద్ద సర్వీసు రోడ్డు నిర్మించి, ఓర్వకల్లులో బస్టాండ్ మినహా, మిగతా చోట్ల సర్వీసు రోడ్డు లేక భారీ వాహనాలు వచ్చినప్పుడు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగిన టిప్పర్ ప్రమాదంలో ఇద్దరు కాలేజి విద్యార్థినులు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు హైవే అధికారులు సర్వీసు రోడ్డు నిర్మిస్తామని చెప్రారని, అయితే నేటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. నాయకులు రాజు, శివ, అయ్యప్ప, విష్ణు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు!



గడివేముల తహసీల్దార్ కార్యాలయంలో తక్కువ సంఖ్యలో హాజరైన అధికారులు

గడివేముల: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారిక వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు అలా వచ్చి..ఇలా వెళ్లిపోయారు. జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నంద్యాల జిల్లా కలెక్టర్ ఉదయం 11 గంటల వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం వివిధ గ్రామాల అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. జిల్లా కలెక్టర్ ఉపన్యాసం ముగిసిన వెంటనే మండల స్థాయి అధికారులు వెళ్లిపోయారు. దీంతో తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన బాధితులు వెనుతిరుగారు.

సత్ప్రవర్తనను అలవరచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్

ఓర్వకల్లు:విద్యార్థులు పాఠశాల దశనుంచే సత్ప్రవర్తన కలిగి, విద్యాబుద్ధులు నేర్చుకోవాల ని ఎస్‌ఐ సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, గురువుల పట్ల భయభక్తులు కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- కమిషనర్ రవీంద్రబాబు
- ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 17 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని, ఒకవేళ జాప్యం జరుగుతుంటే దానికి కారణాలేంటో సంబంధిత అర్జీదారుడికి స్పష్టంగా వివరించాలని కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై అధికారుల నిర్లక్ష్యం



సి.బెళగల్‌లో పీజీఆర్ఎస్‌కు హాజరైన ముగ్గురు అధికారులు

సి.బెళగల్: ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పక హాజరు కావాల్సి ఉంటుంది. అయితే పలువురు అధికారులు మండల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తూ, కనీసం పీజీఆర్ఎస్‌కు సైతం రావడం లేదు. తహసీల్దార్ వెంకటలక్ష్మి సోమవారం సెలవు పెట్టడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం కార్యక్రమం నిర్వహించగా కేవలం ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు మాత్రమే హాజరయ్యారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, కొత్తకోట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాత్రమే హాజరయ్యారు. మిగతా ఇతర శాఖల అధికారులు పీజీఆర్ఎస్‌తో పాటు తమ విధులకు సైతం డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పీజీఆర్ఎస్ సక్రమంగా నిర్వహించడంతో పాటు, ఉద్యోగులు విధులకు రెగ్యులర్‌గా హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీపీతో సమావేశమైన ఆడిట్ బృందం



సి.బెళగల్లో ఎంపీపీ బొంతల మునెప్పతో సమావేశమైన సోషల్ ఆడిట్ బృందం

సి.బెళగల్: మండలంలో ఉపాధి హామీ పనులపై త్వరలో చేపట్టనున్న 18వ సామాజిక తనిఖీ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు ఎంపీపీ బొంతల మునెప్పను కలిశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన్ను తనిఖీ స్టేట్ రీసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు (డీఆర్పీలు) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పలు పనులపై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, తనిఖీలకు సహకరించాలని ఎంపీపీని కోరారు. తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని, ఎందుకు అవసరమైన సౌకర్యాలు మండల అధికారులు చేపడతారని ఎంపీపీ వివరించారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎం కాశయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న డీ.కాశయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మన్‌కుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇవ్వాలన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆయాల పేరుతో ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకంలో ప్రతి విద్యార్థి నుంచి రూ.2 వేలు జమ చేసుకుందని, ఆ నిధులతో వారికి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయాలు బజారమ్మ, సుశీలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైభవం.. వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా పూజలు





ధ్వజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, నృత్యాలు చేస్తున్న చిన్నారులు

గడివేముల: మండలంలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో వెలసిన బాలాజీ టెంపుల్ (టెంపుల్ ఆఫ్ స్టెప్స్) వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరిర్విరామంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పుణ్యాహవచనం, వీధి ఉత్సవం, అంకుర్పాణ, ధ్వజా రోహణం, శాంతి హోమం, కల్యాణోత్సవం తదితర పూజలు జరిపించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జిందాల్ యాజమాన్యం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

4న లేజర్ రన్ ఎంపిక పోటీలు

కల్లూరు: ఈనెల 4వ తేదీన కర్నూలు నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాల బాలికల విభాగాలలో లేజర్ రన్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మోడరన్ పెంటలన్ సెక్రటరీ మంచికంటి అవినాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు రూ. 50 ప్రవేశ రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9247400100 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ధవలేశ్వర్‌నాయుడు కుమారుడు పవన్ తన బంధువైన నారాయణ కుమారుడు ధనుష్ తమ పనుల నిమిత్తం సి.బెళగల్‌కు స్కూటర్‌పై వెళ్తున్నారు. గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న కుదుపు వద్ద స్కూటర్ అదుపుతప్పి గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ధనుష్ తలకు తీవ్రగాయం అయ్యింది. మరో వ్యక్తి పవన్ చెయ్యి విరిగింది. స్థానికులు బాధితులను 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రజలకు ప్రత్యామ్నాయం చూపండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 19 వార్డు గణేష్‌నగర్, పూలే అంబేడ్కర్ నగర్ కాలనీలో 24 సంవత్సరాల నుంచి నివాసముంటున్న పేద ప్రజలకు ప్రత్యామ్నయం చూపిన తర్వాతనే ప్రభుత్వ అధికారులు తగు నిర్ణయం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న 300 మంది పేదలకు తాగునీరు రాకుండా అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్కడ నివసిస్తున్న పేదలందరికీ అన్ని మౌలిక వసతులతో మరో చోట వసతులు, సదుపాయాలు కల్పించిన తర్వాతనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 19వ వార్డు నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



సి.బెళగల్ హైస్కూల్ హెచ్‌ఎం అబ్దుల్‌అజీమ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సి.బెళగల్: సమాజంలో ఉపాధ్యాయ వృతి గౌరప్రదమైనదని, ప్రతి ఉపాధ్యాయుడు అందుకు అనుగుణంగా తమ విద్యా బోధనలను కొనసాగించాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అబ్దుల్‌అజీమ్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆ పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ ఉపాధ్యాయ వృత్తి, సేవలు, ప్రజలలో గుర్తింపు తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం అబ్దుల్‌అజీమ్, హసీనా దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.

పంచాయతీల్లో నిధుల కొరత!

- ఎనిమిది నెలలుగా ఇబ్బందులు
- 15వ ఆర్థిక సంఘం నిధుల మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ మాత్రమే జమ
- రెండో ఇన్‌స్టాల్‌మెంట్ జమ కాని వైనం
- పెండింగ్‌లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు
- ఇంకా జమ కాని స్టాంప్ డ్యూటీ
- ఆర్థిక కష్టాల్లో పంచాయతీలు



పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయం

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామా పంచాయతీలకు కేటాయించే నిధుల్లో కోత పెడుడుతుండడంతో నిధుల కొరత కారణంగా సర్పంచ్‌లు, అధికారులు ఏ పని చేయాలన్న ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీలు అన్ని 15వ ఆర్థిక సంఘం, స్టాంప్‌డ్యూటీ, సినరేజ్ గ్రాంట్, ఫర్ క్యాప్టాపై వృత్తి పన్నుల పైనే ఆధారపడి ఉన్నాయి. అయితే గ్రామ పంచాయతీల్లో నిర్వహణ ఖర్చులు అమాంతంగా పెరిగిపోవడంతో వచ్చిన నిధులు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, మైనర్ రిపేర్ల ఖర్చులకు సరిపోవడం లేదు. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీలో ప్రజలకు సదుపాయాల కల్పనకు సంబంధించి ఏవైనా పనులు చేయాలన్న నిధుల కొరతతో ముందడుగు వేయలేకపోతున్నారు.

పెరిగిన నిర్వహణ ఖర్చులు..

మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో 13,382 గృహాలున్నాయి. వీటిలో 54,033 మంది జనాభా ఉన్నారు. వీరిలో పురుషులు 26,904, స్త్రీలు 27,123 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ప్రగల్భాలు పలికింది. చేసిన ప్రతి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ నుంచే తీసుకోవాలని చెప్పడంతో సర్పంచ్‌లు తీవ్రంగా మండిపడుతున్నారు. వీటికి తోడు గ్రామ పంచాయతీల్లో ట్రికిళ్ల నిర్వహణ, వాటికి రంగు మార్చడం, విద్యుత్ బకాయిలు, పైపులైన్ సమస్యలు, ఓహెచ్ఆర్‌లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ పనులు పెరిగిపోయాయి. దీంతో చేసిన పనులకే దిక్కులేకుండాపోగా ఉన్నఫలంగా అదనపు ఖర్చులు పెరిగిపతున్నాయని వాపోతున్నారు.

తొమ్మిది నెలలుగా నిధుల కొరత..

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు గత ఏడాది 20204–25 సంవత్సరానికి సంబధించి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద సెప్టెంబర్ 3న 19 పంచాయతీలకు సంబధించి రూ.1,15,8,021 విడుల చేశారు. ఆ నిధులతోనే నెట్టుకొస్తున్నారు. రెండో విడత కూడా కేంద్రం విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని విడుదల చేయలేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు స్టాంప్ డ్యూటీ కూడా ఇంకా జమ చేయలేకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారమవుతుంది. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యత..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యత ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పారు. అయితే వేడుకలకు నిధులు అందిస్తారని అందరు భావించినా.. పంచాయతీల నుంచే వాడుకోవాలని జీవో జారీ చేయడంతో సర్పంచ్‌లు మండిపడుతున్నారు. పంచాయతీలకు జీవం పోశామని పదపదే చెబుతున్నా నిధుల విడుదలలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుందని మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీల్లో నిర్వహణ మరింత దారుణంగా ఉంటుందన్నారు.

త్వరలో జమవుతాయి

పంచాయతీలకు త్వరలోనే 15 ఆర్థిక సంఘం నిధులు రెండవ దఫా నిధలు జమ అవుతాయి. ఈ విషయాన్ని ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పంచాయతీల్లో అనేక బిల్లులు పెండంగ్‌లో ఉన్నాయి. సర్పంచ్‌లు 15 ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడు జమ అవుతాయని అడుగుతున్నారు. ఉన్నతాధికారులు నిర్వహించే ప్రతి సమావేశంలో వారికి తెలియజేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ